# ఆదర్శాలకు అడుగున

రామలింగేశ్వరరావు – సంక్షేపంగా రామం – చాలా చదువుకున్నవాడు. రష్యాని గురించి అతనికి తెలిసినంతగా అతని సహాధ్యాయుల్లో ఇంకెవరికీ తెలియదు. అతను ఎప్పుడో ఒక రోజు చాలా గొప్పవాడయిపోతాడని అందరికీ నమ్మకం. అతడు తన ఆదర్శాలను గురించి అతి ఉత్సాహంగా చకచక మాట్లాడగలడు. అతడు మాట్లాడుతుంటే, వినే వాళ్ళందరికీ అలా చూపు మేరలో చక్కని స్వర్గ మొకటి చూచాయగా, ఆశగా ఆనుతో ఉంటుంది. వ్యక్తిత్వపు పోటీలలో ప్రథమ బహుమతి అతనిదే. అతను అప్పుడే రెండు మూడు చక్కని బొమ్మలు గీశాడు, నాలుగయిదు చక్కని పద్యాలు రాశాడు.

రామం వేసవి శలవుల్లో వంగవారి పేట వెళ్ళాడు; వెళ్ళడానికి కారణం ఉంది, ప్రతి వేసవిలో అతనికి ఆ అలవాటు ఉంది.

వంగవారిపేటలో వారణాసి వారి ఇల్లుంది. వారు రామానికి – వేలు విడిచిన పిన తల్లికి – కాలు మడిచిన – ఏదో అవుతారు. అతని కాచుట్టరిక మంతా సరిగ్గా తెలియదు. కాని కృష్ణమూర్తిగారిని అతడు మామయ్యగారని పిలుస్తాడు. ఏదో నోటికి వచ్చిన చుట్టరికం – చాలా అనుకూలమైన వరస. ఆయన మద్రాసులో వకీలు, వంగవారి పేటలో వంద ఎకరాలదాక భూమి ఉంది. వేసవిలో ఆయన కొద్దిరోజులు తన సొంత ఊరు వచ్చి, తన సొంత ఇంట్లో ఉండి, తన సొంత డబ్బు పోగుచేసుకుని తిరిగి కోర్టులు తెరిచే నాటికి మద్రాసు తిరిగిపోతుంటాడు. ఆయనంటే రామానికి ఎంతో అనురాగం. రెండు కుటుంబాలకీ దగ్గర పరిచయం చిరకాలం నించీ ఉంది. రామాన్ని ఆ కుటుంబంలో అందరూ చిన్నతనం నించీ ఎరుగుదురు.

కృష్ణమూర్తిగారి కూతురు కృష్ణవేణి. ఆ అమ్మాయి క్వీన్ మేరీస్‌లో చదువుతోంది. ఆమె చక్కగా పాడగలదు; చక్కగా నాటకాలలో వేషాలు వెయ్యగలదు. ఆ అమ్మాయిని రామం మొదట ఎప్పుడు చూచాడో అతనికి జ్ఞాపకంలేదు. కాని రెండు సంవత్సరాలనించీ ఇద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. అంటే మరేమీ లేదు. అతడు సాధారణంగా రష్యాని గురించి రాస్తుంటాడు – అక్కడ రాజకీయంగా ఆడవాళ్ళకు గల హక్కులు వగైరా. ఆమె సమాధానాలలో ప్రశ్నలుంటాయి. ఆమెకు తోచిన సందేహాలన్నీ అతడు తీరుస్తుంటాడు. అయితే ఆ ఉత్తరాలు ఎవరు చూచినా ప్రమాదం లేనివి. దైహికమయిన వాంఛ లేకుండా స్త్రీని తన సోదరిలాగ – ప్రేయసిలాగ అయినా ఫరవాలేదు – ప్రేమించడమే పరమాదర్శమని అతని వాదం. ఆ వాదాన్ని అనేక మంది మిత్రుల దగ్గర అతడు విపులీకరించాడు. ఆ వాదంలో ఉన్న కొత్తదనానికీ, అనుకూల్యానికీ వారంతా ఒప్పుకున్నారు. అంచేత పరాయి ఆడవాళ్ళను చూడవచ్చు, వాళ్ళ సౌందర్యాన్ని కళ్ళతో ఆస్వాదించవచ్చు. అందులో తప్పేమీలేదని అతడు వాళ్ళందరికీ నచ్చచెప్పాడు – ఆ చూపులో దైహికమయిన వాంఛ లేకపోతే సరి. అంచేత ఇదివరకు ఆ పని తప్పనుకుని

తమలో తాము సిగ్గుపడే యువకులందరికీ అతను ఆదర్శ ప్రాయుడయాడు. అతడు తన వాదాన్ని నైతికంగా, ఆధ్యాత్మికంగా సమర్థించుకున్నాడు.

కృష్ణవేణిని అతడు సోదరిగా చూస్తున్నాడో, ప్రేయసిగా చూస్తున్నాడో, అతనింకా ఆలోచించుకోలేదు. ఏమంటే ఆమె మంచి అందంగా ఉంటుంది. పైగా చదువు, సంస్కారం, మంచి పెంపు, పోషణ, మద్రాసు నివాసం, అన్నీ కలిసి వయసు వచ్చిన కుర్రవాళ్ళను తబ్బిబ్బు చేస్తాయి. అయితే రామం తబ్బిబ్బు కాలేదు. అతని చిత్తస్థయిర్యం ఎప్పుడూ చెడదు. ఆమెతో అతడు చాలా గొప్ప విషయాలు అతి గొప్పగా చెపుతూనే ఉంటాడు. ఆమె అమాయకంగా కళ్ళు తెరిచి ఆశ్చర్యంగా అతన్ని వింటూ వుంటుంది. అతనికి ఇంకా చెప్పాలనీ ఉంటుంది. ఆమెకు ఇంకా వినాలనీ ఉంటుంది.

ఓ మాటు ఏం జరిగిందంటే రామం చెపుతుండగా, కృష్ణవేణి వింటుండగా కనుచీకటి పడిపోయింది. తోటలో మామిడికాయ దింపుతుండగా కృష్ణమూర్తిగారు ఆ పని చూసుకుంటున్నాడు. దింపు అయిపోయిన తర్వాత ఆయన కూలివాళ్ళతో కూడా వెడుతూ పక్కన ఒక గట్టుమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న కృష్ణవేణితో తొందరగా ఇంటికి రమ్మని చెప్పి వెళ్లిపోయాడు. అయితే రామం చెప్పుతున్న విషయాలు చాలా ముఖ్యమైనవి కావడంచేత, అతను అద్భుతంగా చెపుతున్న కారణంచేత కృష్ణవేణికి పొద్దు తెలియలేదు.

కనుచీకటి పడుతుండగా ఇద్దరూ లేచి ఇంటికి వచ్చారు. దారిలో ఒక కాలవ దాటారు. సన్నపాటి తాటిపట్టిమీద ఒకరు ముందు ఒకరు వెనకా నడిచారు. మధ్యలో ఆమె కొంచెం భయంవేసి అతని చెయ్యిపట్టుకుంది. అతను జాగ్రత్తగా అవతలికి దాటించాడు. ఇదంత పెద్ద విషయం కాదన్నట్టు అతను రష్యాని గురించి చెపుతూనే ఉన్నాడు. ఆమె వింటూనే ఉంది. కాని అతనికి ఆ సంగతి చాలాకాలం జ్ఞాపకం ఉంది. ఇంటికి వచ్చిన తర్వాత కృష్ణమూర్తిగారు యిద్దరినీ అంత చీకటి పడ్డదాకా ఉన్నందుకు కొద్దిగా మందలించారు.

అటువంటివి ఈ రెండేళ్ళలోనూ చాలా జరిగాయి. అవన్నీ రామానికి జ్ఞాపక మున్నాయి. అటువంటి స్వల్ప విషయాలు అతనుగాని ఆమెగాని ఉత్తరాలలో వ్రాసుకోరు. అటువంటివన్నీ తిరిగి వేసవిలో కలుసుకున్నప్పుడు ముఖాముఖిని ఏకాంతంగా కూర్చుని జ్ఞాపకం తెచ్చుకుంటారు.

ఈసారి రామం వంగవారిపేట వెడుతుండగా అతని మనస్సులో ఒక సందేహం మొలకెత్తింది – ఒకవేళ తను కృష్ణవేణిని ప్రేమిస్తున్నానా? అని. ఆ సందేహం తీరడానికి తగిన సాక్ష్యం అతనికి ఆమెను చూసేదాకా దొరకలేదు. అతడు ఆమెను చూడగానే, గుండె కొంచెం గబగబ కొట్టుకోడం, తనకి తెలియకుండా చిరునవ్వు పెదవులమీదికి రావడం, పరధ్యానం కళ్ళలో ప్రవేశించడం మొదలయిన సూచనలు కనబడ్డాయి. సరే, దాంతో అతడు ఆమెను ప్రేమించినట్టు నిర్ధారణ అయింది. ఆ ప్రేమ దైహికమయినది కాదనీ, కేవలం ఆధ్యాత్మికమయిందనీ, సామాన్యంగా ఆడవాళ్ళకీ మగవాళ్ళకీ మధ్యను ఏర్పడేలాంటిది కాదనీ, ఆదర్శమయినదనీ వేరే చెప్పాలా?

అతనికి ఉత్సాహం ఇనుమడించింది. అతని వాగ్ధోరణికి కృష్ణమూర్తిగారే ఆశ్చర్యపడ్డారు. కృష్ణవేణి చెవిలోంచి హృదయందాకా అతని మాటలు విద్యుత్తరంగాలను పుట్టించేవి.

ఇద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు అతడు సహజంగా స్త్రీ పురుష సమస్యను గురించి ప్రారంభించాడు – దేశంలో స్త్రీ బానిస అయిపోయింది. ఆమె తన భర్తయొక్క ఆస్తి - అతని పొలంలాగే. ఆమె ఫలించకపోతే, అంటే గొడ్రాలయితే, అతను ఇంకొకత్తెను సంపాదించుకుంటాడు. రామానికి పాతివ్రత్యంమీద నమ్మకంలేదు. ఏమిటది. ఇద్దరూ సృష్టిలో సమానమయినపుడు, ఒకరిమీద ఒకరికి ఉండవలసిన అనురాగం సహజంగా స్వేచ్ఛగా ఉండాలిగాని, ఒకరికే పాతివ్రత్యపుటాదర్శం అంటగట్టి రెండో వారికి పత్నీవ్రత్యం ఎందుకు అంటగట్టలేదు? సాంఘికశాస్త్రంలో చెప్పినట్టుగా ఈ ఆదర్శం – వెనక రోజుల్లో అమలులో ఉన్న ఫ్యూడల్ పద్ధతినిబట్టి వచ్చింది. ఇందులో నిజంగా పెద్ద ఆదర్శం ఏమీలేదు. అప్పటికి ఆచరణలో ఉన్న ఆర్థిక పద్ధతి ప్రకారం ఇంటికి యజమాని అన్నిటికీ యజమానే. అతని భార్యా, పిల్లలూ, ఇల్లూ, వాకిలీ, దూడ దుడికీ అన్నీ అతని ఆస్తి, ఇప్పటి రోజులకి తగిన పరస్పరసంబంధం స్త్రీ పురుషుల మధ్య లేకపోవడంచేత సంఘంలో నిర్జీవత ప్రవేశించింది. స్త్రీ పురుషులకు సమాన ప్రతిపత్తి, సమాన గౌరవం – వేయేల సమానార్థిక స్వత్వాలు ఉండి తీరాలి. విడాకుల చట్టం రావాలి. ఆడవాళ్ళకి ఆస్తి కావాలి – ఆస్తి అంటూ ఉన్నంతకాలం. అతని కసలు ఆస్థి అనే సంస్థమీద గౌరవంలేదు. కాని మగవాడి కున్నంత కాలం ఆడదానికీ ఆ హక్కు కావాలి.

ఇన్ని సంగతులు కృష్ణవేణి ఎరగదు. క్వీన్‌మేరిస్‌లో ఆడపిల్లలకెవ్వరికీ ఇవేవీ తెలియవు. ఈ సంగతులు తెలిసుంటే వక్తృత్వపు పోటీలలో ఎన్ని బహుమతులు కొట్టేయ్యొచ్చు! నిజంగా ప్రతిరోజూ రామం ఇల్లాంటివన్నీ చెపుతుంటే ఎంత బాగుంటుంది! క్వీన్‌మేరిసులో ఆడపిల్లలకి ఏమీ తెలియవు. ఊరికే నీటుగా దుస్తులు వేసుకుని వీలైతే మగ స్నేహితులతో సముద్రపు టొడ్డున తిరగడం తప్ప, నిజంగా వాళ్ళకు తెలుసుకోవలసిన విషయాలు అనేకం తెలియవు. కృష్ణవేణి ఇవన్నీ రామంతో అతి చనువుగా చెప్పింది.

ఎల్లా అనిపించిందో కాని, జీవితాంతం దాకా తాము ఇద్దరమూ కలిసి ఉంటామనే ఊహ ఇద్దరి మనస్సుల్లోనూ నాటుకుంది. కాలేజీ వదిలిన తరువాత ఏమేమి చెయ్యాలో ఏ ఉద్యమాలు నడపాలో అన్నిటికీ విపులంగా ప్రణాళికలు తయారు చెయ్యడం మొదలుపెట్టారు ఇద్దరూ. ఇల్లు మొదలు, ప్రపంచకం చివర వరకూ ఎల్లా దిద్దాలో వారు అప్పుడే ఆలోచించుకున్నారు.

ఒకరోజుని పొద్దున్న భోజనాలయిపోయిన తరవాత రామం కుర్చీలో కూర్చొని రాబోయే జీవితపు ప్రణాళికను గురించి ఆలోచిస్తుండగా, ఒక చీటి అతని ఒడిలో పడింది. అతను తిరిగి చూశాడు. కృష్ణవేణి చరచర లోపలికి వెళ్ళిపోయింది. చీటి విప్పి చదివాడు.

"ఈవేళ మనం పొలం వెళ్ళొద్దు. చాలా ముఖ్యవిషయం నీతో మాట్టాడాలి. మా నాన్న పొలం వెడుతూ పిలిచినప్పుడు ఏదో చెప్పి తప్పించుకో. సాయంత్రం దొడ్లో జామిచెట్టు దగ్గరికి రా. ఇంట్లో ఎవరూ ఉండరు."

అతని మనస్సు పరిపరి విధాల పోయింది. ఇంత రహస్యం దేనికి? పొలంలోనే మాట్లాడుకోవచ్చుగా? అల్లాగయితే ఎవరికీ అనుమానం ఉండదు. తనమీద ఎవరికయినా ఏ విధమయిన అనుమానమయినా కలిగిందంటే అతనికి తల తీసేసినట్టవుతుంది. అయినా ఈ పరిస్థితిలో అతను ఏం చేస్తాడు?

సాయంత్రం అతను తలకాయ నొప్పి మూలంగా పొలం వెళ్ళలేదు. ఆవేళ ప్రత్యేకం ముంజికాయల ఫలహారంకోసం కుటుంబం అంతా బయలుదేరారు. కృష్ణవేణి, వెనకాల పాలేరు భార్య మంగమ్మతో వొస్తానని తక్కిన వాళ్ళని పంపించింది.

అనుకున్నట్టు జామిచెట్టు దగ్గర రామం కృష్ణవేణిని కలుసుకున్నాడు. ఆమె చాలా ఆందోళనగా ఉంది. క్షణం ఇద్దరూ మౌనంగా నిలబడ్డారు. తరవాత కృష్ణవేణి గబగబా అంది.

"మా నాన్న నా కోసం ఒక పెళ్ళి సంబంధం ఒప్పుకోడానికి సిద్ధంగా ఉన్నాడు."

రామానికి కాళ్ళకింద మట్టి జారిపోతున్నట్టు అనిపించింది. "మరి నీ ఒప్పుదల లేకుండానే?" అడిగాడు.

"ఆ అబ్బాయి ఎవరో మద్రాసులోనే నన్ను చూశాడు. నాన్న అప్పుడే నన్నడిగాడు. నాకిష్టం లేదన్నాను. నీ మొగం నీకేం తెలుసు? కుర్రపిల్లవన్నాడు."

"ఎంత అన్యాయం! నీ కిష్టంలేని పెళ్ళి ఎల్లా చేస్తాడు, మీ నాన్న?"

"చేస్తాడు. నీకు తెలియదు."

ఒక క్షణం మళ్ళీ నిశ్శబ్దం. కృష్ణవేణి అంది, "వాళ్ళకి నేను నచ్చానట."

"నీకు వాళ్లు నచ్చక్కర్లేదు గావును!" తన అసహ్యాన్నంతటినీ ఆ మాటలో వెలిబుచ్చాడు రామం. మళ్ళీ ఒక క్షణం మౌనం.

కృష్ణవేణి తొందరగా మొదలు పెట్టింది. "అందుకే నిన్ను కలుసుకోమన్నది. నా మనసు నీకు తెలుసుగదా? ఈ పరిస్థితిలో.."

"నా మనసు మాత్రం నీకు తెలియదూ? ఈ పాడు సంఘంలోపడి మనం కుళ్ళిపోవలసిందే కాని...."

"అక్కర్లేదు"

రామం అనుమానంగా ఆమెవేపు చూశాడు. ఆమె అతనివేపు చూస్తూ అంది!

"నేను ఒక నిశ్చయానికి వచ్చాను. నిజంగా మనకి ధైర్యం ఉంటే సంఘం ఏం చేస్తుంది. నేను అన్నిటికీ తెగించాను. మామూలుగా అందరి ఆడవాళ్ళలాగా నేను మొగవాడి ఆస్తినయిపోలేను. నన్ను స్వతంత్రంగా బతకనివ్వని మగవాడితో నేనెలా కాపరం చేస్తాను! రామం! మన ఆశయాలన్నీ ఫలించకపోతే ఇంక మనం పుట్టినందుకు ప్రయోజన మేమిటి? మనకి ఇన్ని ఊహలున్నందుకు ఫలితమేమిటి?"

ఆమె ముఖంలో కళ్ళలో అమాయకంగా నిర్మలంగా ఆ ఆదర్శచ్ఛాయలు జ్వలించడం అతను చూశాడు. అతనికి కొంచెం భయంవేసింది. ఆమె గబగబ చెప్పింది.

"నేను నీతో ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. ఎవ్వరికీ తెలియకుండా పారిపోదాం. రిజిస్ట్రేషన్ పెళ్ళి చేసుకుందాం. బొంబాయి పోవడానికి తగినంత డబ్బు నేను పట్టుకురాగలను. ఇక్కడినించే పోదాం."

అతను నిలువుగా నీరయిపోయాడు. ముచ్చెమటలు పోశాయి. లౌకిక ప్రపంచకంలో అల్లాంటి పనికి విలువలేదు. ఫలాని రామం, ఫలాని కృష్ణవేణిని దొంగతనంగా లేవదీసుకుపోయాడు అని పదిమందీ అనుకుంటున్నట్టు అప్పుడే అతని ఊహలో కనబడుతోంది. అతని ఊపిరి ఒక్క క్షణం ఆగిపోయింది. అబ్బ ఇల్లాంటి పనే?

"మీ నాన్నతో నీ మనస్సు విప్పి చెప్పేస్తే?" అన్నాడు.

"లాభం లేదు."

ఆ సంగతి అతనికీ తెలుసును. కృష్ణమూర్తిగారి దృష్టిలో అతని స్థితిగతులు తన అల్లుడు కావడానికి తగవు. ఎంచేతంటే కృష్ణమూర్తిగారి అంచనా ఆస్తిపాస్తుల మీద ఆధారపడుతుంది. కుర్రవాళ్ళలో ఆంతరంగికమయిన, విలువ, ఎన్నరాని విలువ ఆయన కళ్ళకు ఆనదు.

"కాని ఇంత ప్రమాదమైన పని చేస్తే నీకూ నాకూ చెడ్డ పేరు వస్తుంది... అంటే నాకంత పెద్ద పేరుమీద మోజు లేదనుకో. కాని ఇలాంటప్పుడు కొంచెం తాపీగా ఆలోచించుకోవాలి. ఏమంటే చాలా చిక్కులుంటాయి." అతను కృష్ణవేణిని చూశాడు. ఆమె అతన్ని వింతగా కనుబొమలు సన్నం చేసి చూస్తోంది. అతడు ఆకాశం వేపు చూస్తూ అన్నాడు.

"ఆలోచిద్దాం. తొందరపడకు, పేచీ లేని పద్ధతిగా మనం ఆలోచించుకోవాలి.... మన ఆదర్శాలు నిజంగా ఫలించాలంటే... ఉత్త... ధైర్యసాహసాలు..." అతను మాట దొరక్క ఆగాడు. కృష్ణవేణి చటుక్కున ఆమె ముఖం రెండు చేతులతోనూ కప్పుకుని ఏడిచింది. అతనికి తనలో ఏవో తీగలు తెగిపోయినంత బాధ పెట్టింది. ఒక ప్రపంచకం చటుక్కుని నిలిచిపోయినట్టయింది. అతను ఆమెను ఓదార్చబోయాడు. ఆమె అతని చెయ్యి దూరగా తొలగించింది. ఏడుస్తునే అంది.

"ఎందుకు ఈ ఉత్త కబుర్లన్నీని? ఎందుకు నీ ఆదర్శాలన్నీని?" అతను ఏదో చెప్పబోతుండగా ఆమె చటుక్కుని లోపలికిపోయి ఇంటి తలుపు వేసుకుంది. అతను ఆ దొడ్డిలోనే చాలాసేపు కూర్చుని తరవాత వీధిలోకిపోయాడు. ఎన్నోసార్లు కృష్ణవేణిని పలకరిద్దామని చూశాడు. కాని ఆమె కళ్ళలో పట్టరాని ఈర్ష్య, అసహ్యం అతన్ని తరిమికొట్టాయి.

మామాలుకి భిన్నంగా అతను మరునాడే వంగవారి పేట విడిచి వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు కృష్ణమూర్తిగారు అతన్ని జరగబోయే కృష్ణవేణి పెళ్ళికి తప్పకుండా రమ్మన్నారు.

**(తొలి ప్రచురణ తేదీ తెలియదు)**